సాక్షి
పెద్దపల్లి
బుధవారం, 22, నవంబర్, 2023



ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి మంగళవారం ఎల్ఎండీకి 5 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



వైభవంగా గంగాహారతి

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగాహారతి మంగళవారంతో ఎనిమిదోరోజుకు చేరింది.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు 'ఇంటి వద్ద ఓటు'



మాట్లాడుతున్న జ్యోతి

జ్యోతినగర్(రామగుండం): రామగుండం నియోజకవర్గంలోని 80ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్ బాధితులకు ఈనెల 22, 23 తేదీల్లో 12–డీ విధానం ద్వారా ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధి కారి జ్యోతి, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంపత్‌రావు తెలిపారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ మిలీనియం హాల్‌లో మంగళవారం ఇంటి నుంచి ఓటింగ్ విధానంపై మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కల్పించారు. నియోజవర్గంలో 331 మంది 12–డి విధానం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికోసం ఉదయం 7–సాయంత్రం 5 గంటల్లోపు ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించామని, ఇందుకోసం 24 రూట్లలో 24 బృందాలను నియమించామన్నారు. ఓటుహక్కు ప్రక్రియను రహస్యంగా, గోప్యంగా ఉంచాలని సూచించారు. ఈ ప్రక్రియను వీడియో ద్వారా రికార్డు చేస్తామని అన్నారు. అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



విద్యార్థులతో శాస్త్రవేత్తలు

పెద్దపల్లిరూరల్: బ్రాహ్మణపల్లిలో మంగళవారం రామగిరి కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం నిర్వహించారు. రైతువేదిక వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రత్యామ్నాయ పంటల సాగుపై విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పనులు, మేలురకం విత్తనాలు, విత్తనశుద్ధి, ఎరువులు, పురుగుమందుల వాడకం తదితర వివరాల గురించి వ్యవసాయ విద్యార్థులు తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి అలివేణి, సర్పంచ్ గాండ్ల మల్లేశం, ఉప సర్పంచ్ ఓదెల రాజు, ఇన్‌చార్జి శాస్త్రవేత్త వెంకన్న, వినోద్‌కుమార్, యుగందర్, మహేశ్, శ్వేత, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

గోదావరిఖనిటౌన్: కార్తీకమాసం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపనున్నట్లు డీఎం ఎం.నాగభూషణం మంగళవారం తెలిపారు. కాళేశ్వరం, రామప్పకు నవంబర్ 25, 26, 27, డిసెంబర్ 2, 3, 4, 9, 10, 11వ తేదీల్లో ఉదయం 6 గంటలకు గోదావరిఖని నుంచి బస్సులు బయలు దేరుతాయన్నారు. ఉదయం 6.45 గంటలకు మంథని నుంచి సూపర్ లగ్జరీ బస్సు వెళ్తుందన్నారు. పర్యాటక ప్యాకేజీలో భాగంగా కాళేశ్వరం, రామప్ప ఆలయాలు, లక్నవరం కేబుల్ వంతెనకు తీసుకెళ్తామన్నారు. ఒక్కో టికెట్ పెద్దలకు రూ.700, పిల్లలకు రూ.400 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. గోదావరిఖని, మంథని ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 63000 76072, 73828 47427 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పత్తి ధర రూ.6,841

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,841 ధర పలికింది. కనిష్టంగా రూ.5,859 ధర పలుకగా.. సగటు ధర రూ.6,744గా నమోదైంది. 195మంది రైతులు తెచ్చిన 645క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్‌పృథ్వీరాజ్ మంగళవారం తెలిపారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి మహిళల కబడ్డీ పోటీలను ఈనెల 23న నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు తోట శంకర్, వైద కిష్టయ్య మంగళవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 99498 42453, 92480 46244లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నగదు స్వాధీనం

ముత్తారం(మంథని): మచ్చుపేటలో గోదావరిఖనికి చెందిన బోల్లవేని సది వద్ద రూ.50,500 నగదును మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై మధూసూదన్‌రావు తెలిపారు. నగదుకు ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని, ఆ నగదును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగిస్తామని ఎస్సై వివరించారు.

కేసుల చిట్టా విప్పాల్సిందే!

జంగ్ తెలంగాణ

- సుప్రీం ఆదేశాలతో ముందుకు వస్తున్న అభ్యర్థులు
- కేసులు ఉన్నా లేకున్నా దినపత్రికల్లో వెల్లడిస్తున్న వైనం
- కొందరికి అనుకూలం, మరికొందరికి ప్రతికూలం
- నేర స్వభావం చూసి ఓటేయాలంటున్న మేధావులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరూ తమపై ఎన్నికేసులు ఉన్నాయో ప్రజలకు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల నామినేషన్లు వేసిన సమయంలో కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని ప్రముఖ దినపత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి నేరచరిత్ర ఉన్నా బయటపెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమ కేసుల చిట్టాను విప్పుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి మొత్తంగా 216 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పుడు వీరంతా తమపై కేసులు ఉన్నా లేకున్నా పత్రికా ప్రకటనలు అనివార్యంగా ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎవరికీ మినహాయింపు లేదు..

రాజకీయంగా పారదర్శకత పాటించే ఏ నాయకుడికీ ఈ ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఎందుకంటే రాజకీయ నాయకుడు అన్నాక కేసులు ఉండటం సర్వసాధారణం. ప్రజాసమస్యల పోరాటంలో భాగంగా అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఏదో ఒక సమయంలో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తుంది. మన రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో దాదాపు అన్ని పార్టీల నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. అందులో చాలామటుకు కొట్టుడుపోగా.. ఇంకొన్ని విచారణ దశలో ఉన్నాయి. కానీ, రాజకీయ జీవితం మొదలు కాకముందు, రాజకీయాల్లోకి వచ్చాక వ్యక్తిగత కారణాలతో నమోదైన క్రిమినల్ కేసులు కొందరిని తీవ్రంగా ఇబ్బంది పెట్టబోతున్నాయి. వీటిలో ప్రధానంగా భూకబ్జాలు, ఫోర్జరీలు, మోసాలు, హత్యాయత్నాలు ఉన్న వారికి ఈ ప్రకటనల జారీ ప్రతికూలంగా మారనుంది. చిన్న కేసు ఉన్నా తక్కువలో తక్కువ 12 సెం.మీ.ల పొడవు, వెడల్పు విస్తీర్ణం కలిగిన యాడ్ ఇవ్వాల్సి వస్తోంది. అంతేకాకుండా, కేసుల వివరాలు, నేర స్వభావం, నమోదైన ఐపీసీ సెక్షన్లు, విచారణ స్థితిగతులు తదితరాలు పట్టికలో స్పష్టంగా పొందుపర్చాల్సి ఉంటుంది. కనీసం మూడు రోజులపాటు జిల్లా ప్రజా సంబంధాల అధికారి వద్ద నమోదైన గుర్తింపు పొందిన దినపత్రికల్లో ప్రచురించాలి. ఈ వ్యవహారంలో లేని వారికి మినహాయింపు ఏమీ లేదు. వారు కూడా తమపై కేసులు లేవని ప్రకటన ఇస్తున్నారు.

వెల్లడించకపోతే న్యాయపరమైన చిక్కులు

అభ్యర్థి నేరాల పట్టికను చదివిన వారికి అతని గుణంపై నిర్దిష్టమైన అభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఏ నేరానికి ఏ సెక్షన్ పెడతారన్నది తెలుసుకోవడం క్షణాల్లో పని. ఎందుకంటే దురుద్దేశంతో చేసిన నేరానికి, ప్రజాపోరాటాల్లో భాగంగా నమోదైన కేసులకు స్పష్టమైన తేడా ఉంటుంది. ఇందులో ప్రజాసమస్యలపై పోరాటాలు చేసిన వారికి ఇది కలిసి వచ్చే అంశం కాగా, ఉద్దేశపూర్వక నేరచరితులకు మాత్రం ముమ్మాటికీ గండమే. ఒకవేళ కేసుల విషయాలు వెల్లడించకపోతే.. సదరు అభ్యర్థి భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోక తప్పదు. ఒకవేళ గెలిచి పదవిలో ఉంటే ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశాలున్నాయి.

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు..

కరీంనగర్‌లో 27, హుజూరాబాద్‌లో 22, చొప్పదండిలో 14, మానకొండూరులో 10, సిరిసిల్లలో 21, వేములవాడలో 16, పెద్దపల్లిలో 17, మంథనిలో 21, రామగుండంలో 23, జగిత్యాలలో 15, కోరుట్లలో 15, ధర్మపురిలో 15 మంది అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు.

మంచి వ్యక్తులను ఎన్నుకోవాలి

మంచి వ్యక్తిత్వం, సమాజానికి సేవ చేయాలన్న భావాలున్న వ్యక్తులను ఎన్నికల్లో ఎన్నుకోవాలి. వ్యక్తిగత నేరస్వభావం ఉన్న వారి గురించి ఆలోచించాలి. డబ్బులున్న వారికే టికెట్లు ఇచ్చే ధోరణిని రాజకీయ పార్టీలు మార్చుకోవాలి. నైతిక విలువలు, ప్రజల సమస్యలు పట్టించుకునేవారికి ఇవ్వాలి. ప్రజలు కూడా అలాంటి వారికే ఓటు వేయాలి.

– బుర్ర మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎస్సారార్ కళాశాల

అగ్రనేతలొస్తున్నారు..

- ఉమ్మడి జిల్లాకు ప్రధాని మోదీ, మాయావతి, యోగి, అమిత్‌షా, ప్రియాంకా గాంధీ, రేవంత్‌రెడ్డి, పవన్‌కల్యాణ్
- రేపటి నుంచి 28 వరకు వరుస పర్యటనలు
- భారీ బహిరంగ సభలతో హోరెత్తనున్న ప్రచారం
- జనసమీకరణతో బలనిరూపణకు సిద్ధమవుతున్న పార్టీలు



సీఎం కేసీఆర్



ప్రధాని మోదీ



అమిత్‌షా



యోగి



ప్రియాంక



రేవంత్‌రెడ్డి



మాయావతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీల అధినేతలు ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు నుంచే మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటనలతో గులాబీ శ్రేణుల్లో ఎన్నికల జోష్ నింపారు. షెడ్యూల్ విడుదలయ్యాక సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావం పూరించి, పలు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు. బీజేపీకి మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కోరుట్లలో ధర్మపురి అరవింద్‌కు మద్దతుగా బహిరంగ సభలో పాల్గొన్నారు. తాజాగా మరోమారు పెద్దపల్లిలో నిర్వహించే బహిరంగ సభకు రానున్నారు. బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో ఆ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, సత్తా చాటారు. రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణికి మద్దతుగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ కవిత రామగిరి, పెద్దపల్లిల్లో ప్రచారంలో పాలొన్నారు.

బీఎస్పీకి మద్దతుగా మాయావతి

పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు మద్దతుగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ నెల 23న పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు.

బీజేపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ..

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఎస్సారార్ కాలేజీలో ఈ నెల 27న మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని హోదాలో ఆయన మొదటిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో భారీ జనసమీకరణతో సభ సక్సెస్ చేసేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సైతం ఈ సభకు రానున్నారు. అలాగే, బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌రావును గెలిపించాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 28న పెద్దపల్లికి రానున్నారు. వేములవాడలో 25న నిర్వహించే బహిరంగ సభలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి పాల్గొననున్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు పలు నియోజకవర్గాల్లో రోడ్‌షోలలో పాల్గొననున్నారు. అలాగే ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ త్వరలో రామగుండంలో పర్యటించనున్నారు.

ఏ రోజు ఎవరు..

- 23న – మాజీ సీఎం మాయావతి (పెద్దపల్లి)
- 24న – ప్రియాంకా గాంధీ (హుస్నాబాద్, ధర్మపురి)
- 24న – సీఎం కేసీఆర్ (రామగుండం)
- 25న – యూపీ సీఎం యోగి (వేములవాడ)
- 26న – పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి (పెద్దపల్లి)
- 27న – ప్రధాని మోదీ (కరీంనగర్)
- 28న – హోంమంత్రి అమిత్‌షా (పెద్దపల్లి)

హుస్నాబాద్, ధర్మపురికి ప్రియాంకా గాంధీ

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటలకు హుస్నాబాద్‌లో, సాయంత్రం 4 గంటలకు ధర్మపురిలో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. అలాగే, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు మద్దతుగా 26న నిర్వహించే విజయభేరి సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు.

మరోసారి గులాబీ దళపతి..

సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఈ నెల 24న సింగరేణి స్టేడియంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు మద్దతుగా నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. మంత్రి కేటీఆర్ రామగుండం, మంథనిల్లో రోడ్ షోలు నిర్వహించనున్నారు. వారం రోజుల్లో ఇలా అగ్రనేతలు రానుండటంతో అందరి దృష్టి ఉమ్మడి జిల్లాపై పడింది.

పార్టీ ఏదైనా వేదికలు ఇవే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల సభలను ఒక్కటే ప్రాంగణంలో నిర్వహిస్తుండటం గమనార్హం. కరీంనగర్‌లో ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్, పెద్దపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, రామగుండంలో సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియమే వేదికలవుతున్నాయి.

'ఇంటినుంచే ఓటు'కు 622 అర్జీలు

జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: దివ్యాంగులు, 80ఏళ్ల పైబడిన వారు ఇంటినుంచే తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు జిల్లాలో 622మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. స్థానిక అమర్‌నగర్ ప్రాంతంలో ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగం సర్వేను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఓటు వేసే సమయంలో గోప్యత పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రిటర్నింగ్ అధికారి మధుమోహన్, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులతో జాయింట్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్‌అహ్మద్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం అత్యవసర సేవల్లో పనిచేసే వారికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగంగా సాగుతోందని జిల్లా అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. 98,348 ఓటరు కార్డులు ముద్రిస్తున్నట్లు తెలిపారు. మరోరెండు రోజుల్లో పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, మధుమోహన్, హనుమా నాయక్, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ ఉన్నారు.



వివరాలు ఆరాతీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

రామగిరి(మంథని): ఫలితాల లెక్కింపు సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సెంటనరీకాలనీ జేఎన్టీయూలోని కౌంటింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. డిసెంబర్ 3న మంథని, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల కౌంటింగ్ ఇందులో చేపడతామన్నారు. సిబ్బంది, ఏజెంట్లకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక గదులు, సీసీ కెమెరాలు, వేగవంతమైన నెట్ సౌకర్యం, కంప్యూటర్‌లు, సీటింగ్‌లు ఏర్పాట్లు చేయాలన్నారు. మంథని రిటర్నింగ్ అధికారి వి.హనుమా నాయక్, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కుమార్‌స్వామి, రాంమోహన్‌రావు ఉన్నారు.

ఫిర్యాదులు మా దృష్టికి తీసుకు రండి



అభ్యర్థులతో సమావేశమైన అధికారులు

గోదావరిఖని: ఏమైనా ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తేవాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా సూచించారు. రామగుండం రిటర్నింగ్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ నిర్వహించారు. అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రెండొవిడత ర్యాండమైజేషన్ చేపట్టారు. యంత్రాలు, పోలింగ్ కేంద్రాల వరుస సంఖ్య, కేటాయింపులు తదితర అంశాలపై చర్చించారు. సువిధ పోర్టల్, ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. 12–డీ దరఖాస్తుదారుల వివరాలను అభ్యర్థులకు తెలియజేశారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇంటివద్ద పోలింగ్ నిర్వహిస్తామని ఆయన వివరించారు.

ఓట్లకోసం వచ్చే నాయకులను ప్రశ్నించండి

గోదావరిఖని: ఓట్లకోసం వచ్చే నాయకులను సమస్యలపై ప్రశ్నించాలని పౌరహక్కుల సంఘం నాయకులు మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, నార వినోద్, బొడ్డుపల్లి రవి కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామిక విలువలు, హక్కులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు.



ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న నాయకులు

కార్యక్రమంలో నాయకులు బాలసాని రాజయ్య, సుదర్శన్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

1950 టోల్‌ఫ్రీ నంబరుకు 1445 ఫిర్యాదులు

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలపై టోల్‌ఫ్రీ 1950 నంబరుకు ఇప్పటిదాకా 1445, సీ విజిల్ యాప్‌కు 169 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రూ.కోటి60లక్షల46వేల860 నగదు జప్తు చేశామని పేర్కొన్నారు. అందులో ఆధారాలు చూపడంతో రూ.కోటి 19లక్షల 46వేల 860 నగదు విడుదల చేశారని కలెక్టర్ వివరించారు. ఆధారాలు చూపని రూ.41లక్షలను సీజ్ చేసి ఉంచినట్లు పేర్కొన్నారు. పలు తనిఖీల్లో ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, స్పీకర్లు, గోడగడియారాలు, గంజాయి, వెండిదీపాలు, చీరలు సీజ్ చేశారని, ఆధారాలు చూపిన వస్తువులను విడుదల చేసినట్లు తెలిపారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికల విధులను బాధ్యతగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా, రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ సూచించారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రంలో మంగళవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలన్నారు. తొలుత పోలింగ్ కేంద్రాల్లో పరిసరాలు తనిఖీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని, దివ్యాంగులకోసం ర్యాంపులు టాయిలెట్స్ నిర్మించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గోడలపై పోస్టర్లు, ముద్రలు లేకుండా చూడాలని అన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్‌సింగ్‌రాణా

అసాంఘిక కార్యకపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలకు భంగం కలిగితే వెంటనే సెక్టార్ అధికారి, ఆర్వోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే, తిరిగి వచ్చే సమయంలో గుర్తింపు ఇచ్చిన వాహనాల్లో గుర్తించిన మార్గంలోనే ప్రయాణం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారు సంపత్‌రావు, జ్యోతి, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే నా బలం.. బలగం

- బీఆర్ఎస్ వస్తే తెలంగాణ క్షేమం.. సంక్షేమం
- తొమ్మిదిన్నరేళ్లలో ఎంతోఅభివృద్ధి చేశాం
- 'సాక్షి'తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

సాక్షి, పెద్దపల్లి: 'గతంలో ఎన్నడూ లేనివిధంగా మంథని నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ ప్రతీగడపకు చేరాయి. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ ప్రజారంజక పాలనను ప్రజలు గమనించారు. అందుకే నాకు ప్రచారంలో బ్రహ్మరథం పడుతున్నారు. నా విజయానికి బీఆర్ఎస్ చేసిన సంక్షేమం, అభివృద్ధే దోహదం చేస్తుంది' అని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మంథనిలో నా ఇల్లు...

ప్రజలు నన్ను 2014లో గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిత్యం వారికి అందుబాటులో ఉంటున్నా. నియోజకవర్గంలో ఏదోఒక గ్రామంలో ఉంటాననే పేరు తెచ్చుకున్నా. పూర్వ ఎమ్మెల్యేలు కూడా నాలాగా ప్రజలమధ్యలో లేరు. ప్రజలే నాబలం.. నాబలగం. ఇక్కడే పుట్టా, ఇక్కడే పెరిగా.. ఇక్కడే చస్తానని గోదారమ్మ సాక్షిగా ప్రమాణం చేసి చెప్తున్నా.



బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండి

మంథనిలో ఒకేకుటుంబం 7సార్లు, కాంగ్రెస్ 45 ఏళ్లగా పాలించాయి. వారు చేయలేని అభివృద్ధిని కేవలం తొమ్మిదిన్నరేళ్లల్లోనే చేసి చూపెట్టాం. ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా ప్రతీ ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించా. అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. బీసీ బిడ్డను ఈసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ, మా పార్టీలో బీసీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా పోటీచేస్తారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ఎమ్మెల్యేగా రూ.1,100కోట్లతో అభివృద్ధి చేశా. ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు ఏం చేశారో ప్రజలకు చెప్పాలి. ఎవరి హయాంలో ఏంచేశారో మంథని సెంటర్‌లో చర్చకు నేను సిద్ధం. డబ్బుకట్టలతో, మాయమాటలతో గెలిచాక హైదరాబాద్‌కు పోయేవాడిని కాదు. గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉంటా.

రూ.1,000కోట్లతో అభివృద్ధి చేస్తా

2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాక సుమారు రూ.1,100కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాను. రింగ్‌రోడ్డు పూర్తిచేశా. ముత్తారం, ఓడేడ్, ఖమ్మంపల్లి బొక్కలవాగుపై వంతెనలు నిర్మించా. పుట్ట లింగమ్మ ట్రస్ట్ ద్వారా ఉచిత వివాహాలు, సేవకార్యక్రమాలు చేశా. నన్ను మరోసారి గెలిపిస్తే సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.1,000కోట్ల ప్రత్యేక ప్యాకేజీ తీసుకొచ్చి మంథని రూపురేఖలు మార్చుతా. అలాగే హైదరాబాద్‌లో చదువుకునే పిల్లలకు నా సొంత పైసలతో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తాం. గృహలక్ష్మి పథకం ద్వారా అర్హులైన పేదవారికి ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేస్తా.

బ్రహ్మరథం పడుతున్నారు

కాంగ్రెస్ అమలు చేయని సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రవేశపెట్టారు. వాటి లబ్ధిదారులు ఎంతోమంది ఉన్నారు. నేను ప్రచారానికి వెళ్తే వారందరూ బ్రహ్మరథం పడుతున్నారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆసరా పింఛన్ల లబ్ధిదారులు పెద్దకొడుకులా చూస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి.

క్లుప్తంగా

గవర్నర్ పురస్కారానికి ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌లో ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. దీంతో డీసీపీ చేతన వారిని మంగళవారం అభినందించారు. ఈనెల 5నుంచి 10వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని సరస్వతీ శిశు మందిర్‌లో జరిగిన పోటీల్లో గాయత్రీ విద్యా నికేతన్‌కు చెందిన విష్ణుప్రియ, మహాలక్ష్మి, లయవర్ధిని, సాహిత్య, లాస్య, వైశాలి ప్రతిభ కనబర్చి గవర్నర్ పురస్కారానికి అర్హత సాధించారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజని, గైడ్ కెప్టెన్ స్రవంతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ధర్మారం(ధర్మపురి): గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన బద్దం మౌనిక (24) అనే వివాహిత సోమవారం ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మౌనికకు వివాహమై నాలుగు సంవత్సరాలు గడిచినా సంతానం కలుగలేదని మనోవేదన గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగింది. ఆ తర్వాత వచ్చిన కుటుంబసభ్యులు గమనించి వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగానే చనిపోయింది. మృతురాలు తండ్రి దొడ్ల కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ధర్మారం(ధర్మపురి): బుచ్చయ్యపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామంలో ఉంటున్న పల్లెవారి గణేశ్(48) అక్కడికక్కడే మరణించాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం తుమ్మవారి గూడేనికి చెందిన పల్లెవారి గణేశ్.. బుచ్చయ్యపల్లి గ్రామానికి వలస వచ్చి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం గణేశ్ బొట్లవనపర్తి నుంచి బుచ్చయ్యపల్లికి సైకిల్ వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ట్రాలీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గణేశ్ ట్రాలీవెనుక టైర్‌కింద పడి దుర్మరణం చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్య


గోపాల్(ఫైల్)

రామగిరి(మంథని): గ్రామ పంచాయతీ కార్మికుడు కస్నూరి గోపాల్(45)పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ గ్రామానికి చెందిన కస్నూరి గోపాల్ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 3న ఇంట్లో గొడవ చేశాడు. అనంతరం కుటుంబ సభ్యులు గంగస్నానం కోసం వెళ్లగా గోపాల్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నాడు. అక్కడ పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోరకు కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ తెలిపారు.

● ఉద్యోగం ఇస్తారా..

ఉపాధి చూపిస్తారా?

● నిరుద్యోగులను ఆదుకుంటే నిజాయితీగా ఓటు వేస్తాం
● 'సాక్షి'తో శాఖ గ్రంథాలయ పాఠకుల అభిప్రాయాలు

పీపుల్స్ ఎజెండా

కోల్‌సిటీ(రామగుండం): 'ఒక్క ఉద్యోగంతో ఆ కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు మారుతాయి. జీవితంలో అందరూ స్థిరపడతారు. ఎవరిపైనా ఆధారపడకుండా తమపని తాము చేసుకుంటూ పోతారు.. అట్లాంటి ఉద్యోగం కల్పించండి.. లేదా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చండి' అంటున్నారు గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలోని పాఠకులు, నిరుద్యోగులు. ప్రభుత్వ ఎప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్ జారీచేయక పోతుందా? అనే గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. మరోవారం రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. రాజకీయ పార్టీలు తమ ప్రచారం ముమ్మరం చేశాయి. ఈ ఎన్నికల్లో యువ ఓటర్లే నిర్ణయాత్మకశక్తిగా మారారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈక్రమంలో శాఖ గ్రంథాలయంలో ఉద్యోగాల సాధనకు ఏళ్లుగా కుస్తీపడుతున్న పలువురు నిరుద్యోగులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.


సమర్థులకే ఓటు వేస్తామంటున్న పాఠకులు

గ్రంథాలయాన్ని పట్టించుకోవాలి



పరిశ్రమలకు నిలయమైన గోదావరిఖనిలో అద్దెగదుల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఇప్పటికైనా పట్టించుకోవాలి. కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రజాప్రతినిధులకు ఎన్నికలప్పుడే యువత, విద్యార్థుల ఓట్లు గుర్తుకొస్తాయి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వమైనా ప్రత్యేక దృష్టి సారించి లైబ్రరీకి పక్కా భవనం నిర్మించాలి. అందులో అన్ని సౌకర్యాలు నిర్మించాలి.
– శ్రీనివాస్, ఎంబీఏ

ఊకదంపుడు ఉపన్యాసాలు వద్దు



రామగుండం నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలి. గతంలో చాలా రాజకీయ పార్టీలు, నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి, తీరా గెలిచాక చేతులు దులుపుకున్నారు. అభ్యర్థులు మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి.
– ఎండీ అస్లాం, ఎంబీఏ

నిజాయితీ అభ్యర్థికే ఓటు



ఈ ఎన్నికల్లో నిజాయితీ అభ్యర్థికి ఓటు వేస్తాం. రామగుండంలో ఆశించిన అభివృద్ధి జరగడం లేదు. అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయడం లేదు. గోదావరి ఒడ్డున డంపింగ్‌యార్డు నిర్వహించడం విడ్డూరం. ఆర్థికంగా ఉన్న వాళ్లను పేదవారి లిస్ట్ నుంచి తొలగించి, అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి. కమీషన్లకు తీసుకోకుండా దళితబంధు ఇవ్వాలి.
– ఆరెపెల్లి సాయి, బీటెక్

యువతను ఆదుకోవాలి



చదివిన చదువులకు ఉద్యోగాల్లేక, మరోవైపు ఉపాధి లభించక చాలామంది యువత ఆందోళన చెందుతోంది. ఎప్పటికైనా నోటిఫికేషన్లు ఇస్తారనే ఆశతో, ప్రతిరోజూ లైబ్రరీకి వచ్చి చదువుకుంటున్నాం. కొత్త లైబ్రరీలను నిర్మించలేని పాలకులు, అధికారులు కనీసం అద్దెగదుల్లోని గ్రంథాయాల్లో కూడా సౌకర్యాలు మెరుగుపర్చడం లేదు. ఇది చాలా దురదృష్టకరం. పాలకులు ఆలోచించాలి.
– మడుపు శ్రీనివాస్, ఎమ్మెస్సీ

డిజిటల్ లైబ్రేరీ కావాలి



పక్కా లైబ్రరీలు నిర్మించలేని దుస్థితిలో పాలకులు ఉండడం సిగ్గుచేటు. రామగుండం నియోజవర్గంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి. పక్కా లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని అభ్యర్థులు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలి. ఉద్యోగ సాధన కోసం గోదావరిఖని లైబ్రరీకి వందలాది మంది యువత చదువుకోవడానికి వస్తోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు.
– పాతిపెల్లి రాజ్‌కుమార్, ఎంబీఏ

సరైన అభ్యర్థికే ఓటు



రామగుండం నియోజకవర్గాన్ని జల, వాయు కాలుష్యంలేని ప్రాంతంగా మార్చడానికి పనిచేసే సరైన అభ్యర్థికే ఓటువేయాలి. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో యువత ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి. పోలింగ్ శాతం పెంచడంలో యువ ఓటర్లు కీలకంగా వ్యవహరించాలి. వందశాతం ఓటుహక్కు వినియోగించుకోవాలి.
– ఈదునూరి శంకర్, సామాజిక కార్యకర్త

గ్రంథాలయ స్థలం కబ్జా చేస్తే ఊరుకునేదిలేదు

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు–3 కింద 1994లో భూములు కోల్పోయిన వారికి, ఐఎఫ్‌టీయూ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోబోమని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. 2000 సంవత్సరంలో స్థానిక ప్రశాంత్‌నగర్‌లో సింగరేణి యాజమాన్యం స్థలాలను కేటాయించిందని గుర్తుచేశారు. రాజీవ్ రహదారి సమీప స్థలం 23ఏళ్లుగా యూనియనల్ అధీనంలోనే ఉందన్నారు. కార్మికుల కోసం చివరిదాకా పోరాడి అమరుడైన యు.రాములు స్మారక గ్రంథాలయానికి ఆ స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. రూ.కోట్లు విలువ చేసే ఈ స్థలంపై కొందరు కబ్జా చేసేందుకు కన్నేసినట్లు చిత్రీకరించి తప్పుడు పత్రాలు సృష్టించి జీవో నంబర్ 76 ఆధారం చేసుకుని అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇదే స్థలంలో రోడ్డు వెడల్పు కింద దుకాణాలు కోల్పోయిన చిరువ్యాపారులు తమ జీవనోపాధి కొనసాగిస్తున్నారన్నారు. వారిని సైతం బెదిరింపులకు గురిచేస్తూ అక్రమంగా పట్టా పొందిన వారు దౌర్జన్యానికి దిగుతున్నారని పేర్కొన్నారు. చిరువ్యాపారులపై వేధింపులు మానుకోవాలని, దొంగ పట్టా చేసిన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈదునూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ నేత భిక్షపతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయస్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు ఎస్.భిక్షపతి అన్నారు. ఎన్టీపీసీలో ఈదునూరు భూమయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించే ఎన్టీపీసీ ఎన్బీసీ సమావేశంలో సమస్యలపై చర్చిస్తామన్నారు. డబ్ల్యూ–0, డబ్ల్యూ–1గ్రేడ్ ఉద్యోగులకు మెడికల్, పదవీ విరమణ తర్వాత మెడికల్ సౌకర్యం పొందేందుకు 15ఏళ్ల సర్వీస్ నిబంధన తొలగింపు, 13ఏళ్లుగా పదోన్నతులు పొందని డబ్ల్యూ–1 గ్రేడ్ ఉద్యోగులకు డబ్ల్యూ–2 గ్రేడ్ పదోన్నతికి ఉన్న ఎనిమిదో తరగతి విద్యార్హత నుంచి మినహాయింపు, కేరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) ప్రవేశపెట్టి కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే పథకం పునరుద్ధరణ తదితర అంశాలపై ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌కు వినతిపత్రం అందించామని అన్నారు.

నూతన కార్యవర్గం

సమావేశం అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎర్రవెల్లి ముత్యంరావు, అధ్యక్షుడిగా ఎస్.భిక్షపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, రాసపల్లి సంపత్, సారయ్య, కార్యదర్శులుగా ఎం.కుమార్, శంకర్, రామాచారి, కోశాధికారిగా భిక్షపతి, సభ్యులుగా గణేశ్, వీరయ్యను ఎన్నుకున్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


క్రీడాకారులతో కోమురోజు శ్రీనివాస్

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కోమురోజు శ్రీనివాస్ సూచించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చేపట్టిన అండర్ – 14, 17 టేబుల్ టెన్నిస్ జిల్లాస్థాయి బాల, బాలికల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక, శారీరకంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. టేబుల్ టెన్నిస్ ఆటతో మేధాశక్తి పెరుగుతుందని వివరించారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ దాసరి రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా, సోమశేఖర్, సత్యం, ఇక్బాల్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సుల్తానాబాద్ రూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ జగదీశ్ అన్నారు. దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్సై విజేందర్‌తోపాటు సీఐ వాహనాలు తనిఖీ చేశారు. డబ్బులు తీసుకెళ్తే పూర్తిఆధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. పోలింగ్ గడువు సమీపిస్తుండటంతో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు భద్రత పటిష్టం చేయాలని సూచించారు.

భగవద్గీతను అనుసరించాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రతి ఒక్కరూ భక్తి భావంతో నిత్యం భగవద్గీతను అనుసరించాలని జగిత్యాలకు చెందిన శ్రీమాన్ నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదన 63వ వార్షికోత్సవంలో భాగంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీమద్భాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు ప్రవచనా లు వినిపించారు. భగవద్గీతను అనుసరించి ముందుకు సాగితే అన్ని శుభాలు జరుగుతాయన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని, ప్రతిరోజు దేవుడిని కొలుస్తూ పనులు చేపట్టాలని, అన్ని విజయవంతమవుతాయని అన్నారు. సృష్టిలో దేవుడిని మించిన శక్తి మరోటి లేదన్నారు. భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బెల్ట్ షాపులో అక్రమంగా లిక్కర్ విక్రయిస్తున్న తిరుపతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం తెలిపారు. బెల్ట్ షాపులో లిక్కర్ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేయగా.. 3.6లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో బైండోవర్ చేసినా లిక్కర్ విక్రయించడంతో తిరుపతి వద్ద లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించినందుకు రూ.లక్ష జరిమానా విధించాలని తహసీల్దార్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, పీసీలు రాజ్‌కుమార్, వెంకటేశం ఉన్నారు.

అరాచకాన్ని అడ్డుకోండి.. అభివృద్ధిని ఆదరించండి

ఉస్మానియా యూనివర్శిటీ జేఏసీ నాయకుడు గడ్డం శ్రీరాం


మాట్లాడుతున్న శ్రీరాం

మంథని: తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు పాలన అరాచకంగా సాగిందని, ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారని, అలాంటి బెదిరింపు పాలన మళ్లీ రాకుండా మంథని ప్రజలు ముందుకు వెళ్లాలని ఉస్మానియా యూనివర్శిటీ జేఏసీ నాయకుడు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ గడ్డం శ్రీరాం కోరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసు విషయంలో ఆయన మంగళవారం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్న సమయంలో తనపై తప్పుడు కేసు నమోదు చేయించి పదేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఆనాడు అక్రమంగా నిర్బంధించడమే కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలని చూశారని పేర్కొన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలే కానీ భయభ్రాంతులు, అరాచకాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసులో యూనివర్శిటీ నుంచి రెండు వాహనాల్లో తీసుకొచ్చి గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారని గుర్తుచేశారు. ఏకస్వామ్య పాలన ప్రజాసామ్యానికి విరుద్ధమన్నారు. భయంతో పాలన నడిపిద్దామనుకునే నాయకుల గురించి ఆలోచన చేయాలని కోరారు. తెలంగాణతోపాటు మంథనిలో ఎంతోఅభివృద్ధి జరిగిందని, మరింత అభివృద్ధి కోసం పుట్ట మధు లాంటి నాయకత్వానికి అండగా నిలవాలని కోరారు.

ఓటుహక్కు వినియోగించుకోండి

టూటౌన్ సీఐ అఫ్జలొద్దీన్


అవగాహన కల్పిస్తున్న సీఐ అఫ్జలొద్దీన్

యైటింక్లయిన్‌కాలనీ: ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని గోదావరిఖని టూటౌన్ రెండో సీఐ అఫ్జలొద్దీన్ కోరారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రామగిరి మండలం చందనాపూర్ గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటుహక్కు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ఇందుకోసం శాంతియుత వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టూటౌన్ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట నుంచి సిరిసేడుకు వెళ్లే మార్గంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. మొట్లపల్లికి చెందిన తాళ్లపల్లి గోదారి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. వాటి విలువ రూ.6,930 ఉంటుందని, స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి రవాణా చేసినా, నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

కార్యక్రమంలో సీఐ రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుళ్లు విశ్వ, మహేశ్, పద్మావతి, శైలజ పాల్గొన్నారు.

21 లీటర్ల నాటుసారా స్వాధీనం

సారంగాపూర్(జగిత్యాల): రేచపల్లి, దాని చుట్టు పక్క గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మ్యాదారంతండాకు చెందిన బానావత్ జగన్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, సిబ్బంది మోహన్‌లాల్, గట్టయ్య, చంద్రశేఖర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై వివాదం

● సోషల్ మీడియాలో వైరల్


సనుగులలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న దివ్యాంగుడు


మల్యాలలో ఎన్నికల అధికారులు

చందుర్తి (వేములవాడ): మండలంలోని మల్యాలలో మంగళవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌పై ఎన్నికల అధికారులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలపై బీఆర్ఎస్ నాయకులకు సమాచారం లేదో ఏమోగానీ అనుకున్న సమయంలో పోలింగ్ ఏజెంట్ పాసులు తీసుకోలేకపోయారు. దీంతో వారిని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ వద్దకు వచ్చేందుకు ఎన్నికల అధికారులు నిరాకరించారు. గ్రామానికి చెందిన చింతం మల్లేశం అనే దివ్యాంగుడు ఓటు వేసే సమయంలో అతడి భార్య అందుబాటులో లేకపోవడంతో అతడి చిన్నమ్మతో ఓటు వేయించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. అందుకు మల్లేశం నిరాకరించి కాంగ్రెస్‌కు చెందిన సంటి ప్ర సాద్‌ను పంపించాలని కోరాడు. ప్రసాద్ సహాయంతో ఓటు వేశాడు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ నాయకుడు ఈర్లపెల్లి రాజు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయిస్తున్నారంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో మల్లేశం సూచించిన వ్యక్తితో ఓటు వేయించామని బదులిచ్చి అక్కడి నుంచి అధికారులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రాజు పేర్కొన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై సెక్టార్ అధికారి రవీందర్‌ను వివరణ కోరగా.. వివా దం ఏమీ జరగలేదని చెప్పారు. కాగా మండలంలోని మల్యాలలో 18 మంది, సనుగులలో 12, లింగంపేటలో ఆరుగురు పోస్టల్ బ్యాటెల్ పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

26న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై.మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో బాలబాలికల విభాగాల క్రీడాకారులకు ఉదయం 9:30 గంటల నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. సత్తా చాటినవారిని డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 01–01–2006 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులన్నారు. బీఎంఐ, ఎత్తు, వయసు, బరువు కలిసి 250 పాయింట్లు మించరాదని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఎస్సెస్సీ మెమో లేదా ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో సెయింట్ జాన్స్ పాఠశాల మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

రేపు ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్..

అండర్–19 బాలబాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో, షటిల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జ్యోతినగర్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ఖోఖో, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారుల వివరాలను ఎస్జీఎఫ్ సెక్రటరీకి బుధవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఫొటోతో కూడిన ఎలిజిబిలిటీ సర్టిఫికెట్, పదోతరగతి మెమో, స్టడీ, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

నేడు స్విమ్మింగ్ పోటీలు

అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలను బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఫొటోతో కూడిన ఎలిజిబులిటీ, స్టడీ, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.